మళ్లీ సీఎంగా జగన్‌కే పట్టం

- ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి



రావులపాలెంలో గృహసారథులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



మామిడికుదురు మండల ఇన్‌చార్జ్‌కు కిట్ అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

రావులపాలెం: రాష్ట్రానికి మళ్లీ సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉంటారని జనం ఆయనకే పట్టం కడతారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పోతంశెట్టి రామిరెడ్డి పార్కు వద్ద రావులపాలెం మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ వలంటీర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి గ్రామ సచివాలయ, గృహ సారథుల కన్వీనర్ కర్రి వెంకట గోవింద కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు కొప్పన శివ, రామచంద్రపురం నియోజకవర్గ పరిశీలకుడు ఒమ్మి రఘురాం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి మాట్లాడుతూ 2024లో భారీ మెజారిటీ లక్ష్యంగా గృహసారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పని చేయాలన్నారు. గత ప్రభుత్వాలు ఇచ్చిన హామీలతో కూడిన మేనిఫెస్టోను వారి వెబ్‌సైట్ నుంచి తొలగించుకున్నాయని, సీఎం జగన్ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన రోజు నుంచే అమలు చేసుకుంటూ వచ్చారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా 95 శాతం అమలు చేసి చూపించారన్నారు. గత ప్రభుత్వంలో పార్టీ కండువాలు కప్పుకున్న వారికే రెండు మూడు పథకాలు వచ్చేవని, అదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కులం, మతం, పార్టీ, వర్గం ఏమీ చూడకుండా అర్హత ఒక్కటే ప్రమాణికంగా అందరికీ అందిస్తున్నారన్నారు. కార్యకర్తలు, నాయకులు ధైర్యంగా మన నాయకుడు చేసిన మంచిని ప్రజలకు వివరించి పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. గృహ సారథులకు ఇచ్చే బ్యాగ్ కిట్లను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి వారికి వివరించారు. పలువురికి కిట్లను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, డీసీఎంఎస్ చైర్మన్ సాకా మణికుమారి, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రజల్ని చైతన్యం చేయండి

మామిడికుదురు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారిలో చైతన్యం తీసుకురావాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సూచించారు. నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో మంగళవారం జరిగిన సమావేశంలో వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో నిర్వహించిన సమావేశానికి పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్ స్లోగన్‌తో ప్రజల ముందుకు వెళదామంటూ దిశా నిర్దేశం చేశారు. గృహ సారథులు వలంటీర్లతో కలసి ప్రతి ఇంటికి వెళ్లాలని, సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలన్నారు. గత ప్రభుత్వ పాలనను, నేడు పాలనను పోల్చి ప్రజలను ఉత్తేజితుల్ని చేయాలన్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి జరిగిందని చిట్టిబాబు పేర్కొన్నారు. నియోజకవర్గంలో రూ.1690 కోట్లతో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలకు పరిష్కారం చూపించామన్నారు. రహదారుల అభివృద్ధి, ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు, నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల ఆధునికీకరణ, ఊడిమూడి వంతెన నిర్మాణం తదితర ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందని చిట్టిబాబు పేర్కొన్నారు. ప్రజలు అంశంశలమైన విశ్వాసంతో ఉన్నారని, వైఎస్సార్ సీపీకి అండగా ఉన్నారని చిట్టిబాబు ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో నగరం ఏఎంసీ చైర్మన్ నక్కా కృష్ణవేణి, మండల ఇన్‌చార్జ్‌లు జక్కంపూడి వాసు, దొమ్మేటి దుర్గారావు, దొమ్మేటి సత్యమోహన్, పీఏసీఎస్ చైర్మన్లు యూవీవీ సత్యనారాయణ, గెడ్డం కృష్ణమూర్తి, ముత్యాల నర్సింహారావు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, పి.గన్నవరం మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, పార్టీ నేతలు తులా గోపాలకృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పరిపాలన



అంబాజీపేటలో మహిళకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



కూనవరంలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

- ఎమ్మెల్యేలు చిట్టిబాబు, వరప్రసాదరావు
- మాచవరం, కూనవరంలో గడప గడపకూ..

అంబాజీపేట: రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా నిరంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మాచవరంలో నాలుగో రోజు గడప గడపకూ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి స్థానిక సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బుక్‌లెట్‌లను అందించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకునేందుకే గడప గడపకూ కార్యక్రమాలు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ప్రజాప్రతినిధులు రోజూ ఆయా డివిజన్లు, గ్రామాల్లో తిరిగి సమస్యలు నేరుగా తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు అవకాశం ఉందన్నారు. కాలనీల్లో డ్రైనేజీలు, రహదారులు నిర్మించాలని, హౌసింగ్ లోన్లు, ఇళ్ల స్థలాలు ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి త్వరలో మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానన్నారు. వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి నాగవరపు నాగరాజు, కొర్లపాటి కోటబాబు, సూదా బత్తుల రాము, అప్పన శ్రీను, పులిదిండి పండుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, దొమ్మేటి సత్యమోహన్, మైలా ఆనందరావు, రాయుడు కృష్ణమహేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధికి పెద్దపీట: ఎమ్మెల్యే రాపాక

రాజోలు: సంక్షేమాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం కూనవరంలో గడప గడపకూ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. కూనవరంలోని ఎస్సీ కాలనీ, కాండ్రేగుల వారి గ్రూపు ప్రాంతాల్లో ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాయన్నారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, సర్పంచ్‌లు కుక్కల బేబీకుమారి, కట్టా శ్రీనివాసరావు, పరంశెట్టి ఏడుకొండలు, చెల్లింగి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మామిడికుదురు: నగరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని నాలుగు గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని ఏడీఈ సీహెచ్ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. పెదపట్నంలంక, పాశర్లపూడి, బి.దొడ్డవరం, పాశర్లపూడిలంక గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. మామిడికుదురు ఆల్ క్యాస్ట్ కాలనీ సమీపంలో జగనన్న కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్న కారణంగా విద్యుత్ సరఫరాకు నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

ఆధార్ సేవలను వినియోగించుకోండి

మామిడికుదురు: సచివాలయాల ద్వారా అందిస్తున్న ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు సూచించారు. పాశర్లపూడిలంకలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీఓ మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బుధవారం మామిడికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోను, గురువారం మామిడికుదురు దీప్తి కళాశాలలోను ఈ శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు.

వేయింగ్ మెషీన్ సీజ్



అంబాజీపేట ఎంఎల్ఎస్ పాయింట్‌లో తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ కంట్రోలర్ రాజేష్

అంబాజీపేట: రేషన్ దుకాణాలకు సరకులను పంపిణీ చేసే మండల లెవెల్ స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్‌లో బియ్యాన్ని తూకం వేసే వేయింగ్ మెషీన్‌లో తేడాలను గుర్తించి సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు తూనికలు కొలతలు శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ కె.రాజేష్ తెలిపారు. తూనికలు, కొలతలు శాఖ జాయింట్ కంట్రోలర్ పి.సుధాకర్ ఆదేశాల మేరకు అంబాజీపేట ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఉన్న వేయింగ్ మెషీన్‌లను రాజేష్‌తో పాటు ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఉన్న రెండు వేయింగ్ మెషీన్లలో ఒకటి సక్రమంగా పనిచేస్తుందన్నారు. రెండోది ప్రతి 1000 కేజీలకు 3.50 కేజీలు తూనికల్లో తేడాలు వస్తున్నట్లు గుర్తించామని రాజేష్ వెల్లడించారు. ఈ వేయింగ్ మెషీన్‌కు సంబంధించి హెడ్ ఇండికేటర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ డిప్యూటీ తహసీల్దార్ జి.శ్రీనివాస్ ఆయన వెంట ఉన్నారు. కొలతల్లో తేడాలను వినియోగదారులు గుర్తిస్తే నేరుగా తూనికలు, కొలతల శాఖ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం



రాంబాబుకు సాయం అందజేస్తున్న రాజా బహద్దూర్

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం అన్నదాన పథకంలో అనారోగ్యంతో బాధపడుతున్న వంట మేస్త్రి దొంగ రాంబాబుకు మంగళవారం దాతలు తోడ్పాటుతో రూ.80,488 ఆర్థిక సాయం పంపిణీ చేశారు. ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు పై మొత్తాన్ని ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాలరాజా బహద్దూర్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ చేతుల మీదుగా రాంబాబుకు అందజేశారు. దాతలు స్పందించిన తీరుపై వారు అభినందనలు తెలిపారు. కాగా రాంబాబు అనారోగ్య విషయంపై సామాజిక మాధ్యమంలో పెట్టిన పోస్టుకు దాతలు స్పందించినట్టు మానవతామూర్తులు గ్రూప్ అడ్మిన్ బోణం రాజు తెలిపారు. ఎంపీటీసీ బైర నాగరాజు, నల్లా విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నల్లా కిరణ్‌ప్రసాద్, బి.సత్యనారాయణ, జె.మాణిక్యాలరావు, బి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన



అయినవిల్లిలో వరి పైరును పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ వెంకట నరసింహారావు

అయినవిల్లి: వరిలో కాండం తొలచు పురుగును నివారించేందుకు ఉపయోగించే సస్యరక్షణ పద్ధతులపై ఏరువాక కేంద్రం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన మంగళవారం అయినవిల్లి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో వరిపొలాలను పరిశీలించారు. డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ ప్రస్తుతం దాళ్వా వరినాట్లు ఆలస్యం కావడం, పగటి ఉష్ణోగ్రతలు హెచ్చుస్థాయిలో నమోదు కావడం, గత పంటలో ఉన్న మోళ్లు సరిగ్గా కుళ్లకపోవడం సార్వా, దాళ్వా మధ్య వ్యవధి తక్కువ సమయం కారణంగా పంట బలహీనత వల్ల చీడపీడలకు ఎక్కువ అవకాశం ఉందన్నారు. దీంతో కాండం తొలచు పురుగు ఎక్కువగా ఉందన్నారు. దీని నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 2.0 గ్రాములు లేదా క్లోరంట్రనిలిప్రోల్ 0.3 మిల్లీలీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. తీవ్రత ఎక్కువగా ఉంటే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు ఎకరాకు 8 కిలోల చొప్పున 20 కిలోలు ఇసుకలో కలిపి వెదజల్లాలన్నారు. అప్పటికీ కంట్రోల్ కాకపోతే అంకురం, కంకి దశలో పురుగు ఆశించి తెల్లకంకిగా మారి తాలుగింజలు అధికంగా వస్తాయన్నారు. కాండం కుళ్లు తెగులు నివారణకు నివారణకు ట్రైబ్యుకోనాజోల్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆయనతో పాటు మండల వ్యవసాయ అధికారి వై.శోభ, ఏఈఏ మధుకుమార్, పలువురు రైతులు ఉన్నారు.

ఎడ్ల పందేలను విజయవంతం చేయాలి

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో ఈనెల 16న జరగనున్న రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పందేలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరా వీరభద్రరావు, సర్పంచ్ గుణ్ణం రాంబాబు అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలో జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని అనేక అవార్డులు సాదించిన ఎద్దులు పరిసర ప్రాంతాల్లో ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగినే పశు ప్రేమికులు సత్వరమే స్పందించాలన్నారు.

గర్భిణుల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు



పెదపళ్లలో హైరిస్క్ గర్భిణులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ సుమలత

ఆలమూరు: గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య రక్షణకు మెరుగైన చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ ఎడిషనల్ డీఎంహెచ్ఓ ఎం.సుమలత అన్నారు. మండలంలోని పెదపళ్లలోని పీహెచ్‌సీని సందర్శించి వైద్యారోగ్య సిబ్బంది అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 13 పీహెచ్‌సీలు ఉన్నాయన్నారు. తల్లి, బిడ్డ రక్షణే ధ్యేయంగా గర్భం దాల్చిన నాటి నుంచి ఆ మహిళ ఆరోగ్య రక్షణ ఆరోగ్య సిబ్బంది తీసుకుంటారన్నారు. అలాగే గర్భిణులకు సంబంధించి హైరిస్క్‌లపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నామన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలు, చిన్నారులకు అందిస్తున్న టీకాల వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. సీహెచ్ఓ పి.వెంకటరత్నం, హెచ్ఈ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, పి.ఉమ, ఫార్మాసిస్టు సుగుణ లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ వి.సుబ్బారావు, ఎల్‌టీ రమేష్, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతో ఉక్కిరిబిక్కిరి



అంబాజీపేట గంగలకుర్రు మలుపు వద్ద మంచు తెరలు

అంబాజీపేట: తొలిసంధ్య వేళలో మంచు వర్షం ఆ తరువాత భానుడి ప్రతాపం మలిసంధ్య వేళ నుంచి చలి ఇలా విభిన్న వాతావరణాలతో కొద్ది రోజులుగా ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇప్పటి వరకు చలిగుప్పెట్లో అల్లాడిన ప్రజలకు రానున్న వేసవిని గుర్తుచేస్తున్నట్లుగా ఈ వాతావరణాలు సూచిస్తున్నాయి. అంబాజీపేటలో మంగళవారం ఉదయం 8 గంటల వరకు క్షేత్రంలో మంచు తెరలు వీడ లేదు. ఆ తరువాత నుంచి మధ్యాహ్నం అయ్యే సరికి భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. దీంతో అప్పుడే వేసవి కాలం వచ్చేసిందా.. అంటూ ప్రజలు చల్లదనాన్ని కోరుకుంటున్నారు. ఫిబ్రవరి చివరి రోజుల్లో ఎండ ఈ విధంగా ఉంటే వేసవిలో పరిస్థితులు ఏ విధంగా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నేటి నుంచి సత్తెమ్మ తల్లి జాతర

ముమ్మిడివరం: మండలంలోని సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మ తల్లి అమ్మవారి జాతర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 8 నుంచి 12 వరకూ జాతర, తీర్థ మహోత్సవాలు జరుగుతాయి. 12న తీర్థ మహోత్సవం పురస్కరించుకుని అమ్మవారిని ఆలయ ప్రాంగణం నుంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించనున్నారు. అదే రోజు భారీ అన్న సమారాధన జరగనుంది. తీర్థ మహోత్సవాలకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

డ్రోన్ రిమోట్ పైలట్‌లో శిక్షణ

అల్లవరం: గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన డీజీసీఏ ఆధీకృత రిమోట్ పైలట్ ట్రైనింగ్‌లో దేవగుప్తం పీఏసీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న శిరంగు దుర్గానాగేంద్ర 12 రోజులు శిక్షణ పూర్తి చేసుకున్నారని పీఏసీఎస్ చైర్మన్ జున్నూరి రామారావు మంగళవారం తెలిపారు. వరిలో స్ప్రేయింగ్, క్రాప్ స్పెసిఫిక్ ఎస్ఏపీ పరిజ్ఞానం, నైపుణ్యంపై శిక్షణ ఇచ్చారన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా స్ప్రేయింగ్, సీడింగ్, ఎరువులు వెదజల్లడం వంటివి నిర్వహిస్తామన్నారు. జిల్లాల్లో సహకార సంఘాల ఆధ్వర్యంలో డ్రోన్ ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

'చల్లా' సేవలు అభినందనీయం



ఆలమూరులో చీరలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: పేద వర్గాల అభ్యున్నతికి చల్లా కుటుంబీకులు చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరులో సోమవారం రాత్రి నిర్వహించిన రాష్ట్ర పార్టీ సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు 58వ జన్మదిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చల్లా కుటుంబీకులు సమకూర్చిన చీరలు, దుప్పట్లను మహిళలకు, వృద్ధులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చేతుల మీదుగా భారీ కేక్‌ను కట్ చేశారు. కర్రి నాగిరెడ్డి, నెక్కంటి వెంకట్రాయుడు, చల్లా నానాజీ, వాసంశెట్టి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు బీరువా అందజేత



హైస్కూల్‌కు బీరువా బహూకరించిన పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: మగటపల్లి శ్రీనామన రామానుజమ్మ సుబ్బారాయుడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు మంగళవారం బీరువాను అందించారు. 2010–11లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సంక్రాంతి పండగ సందర్భంగా కలిశారు. స్కూల్‌కు బీరువాను అందించాలని నిర్ణయించారు. దాని ప్రకారం బీరువాను అందించారు. స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది పూర్వ విద్యార్థులను అభినందించారు.

హంస వాహనం సమర్పణ



జనార్దనస్వామి ఆలయంలో హంస వాహనం సమర్పిస్తున్న భక్తులు

ఆలమూరు: స్థానిక శ్రీ, భూ సమేత జనార్దన స్వామి ఆలయానికి మంగళవారం హంస వాహనం సమర్పించారు. గ్రామానికి చెందిన కంచర్ల సుభాష్, కంచర్ల సీతారామయ్య సోదరులు ఆలయ పురోహితుల వేద మంత్రోచ్చారణల మధ్య వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా నిర్వహించే దేవతామూర్తుల కల్యాణంలో ఈ వాహనాన్ని ఉపయోగించుకోనున్నట్లు దేవదాయశాఖ తెలిపింది.

శివారు చేలకూ పూర్తి స్థాయిలో సాగునీరు



లక్కవరం కాలువలో గుర్రపుడెక్క తొలగింపును పరిశీలిస్తున్న రమేష్, శివకుమార్ తదితరులు

మలికిపురం: పంట కాలువల శివారు చేలకు సైతం పూర్తి స్థాయిలో సాగు నీరు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు గుబ్బల రమేష్ పేర్కొన్నారు. మండలంలోని చింతలపల్లి-లక్కవరం ప్రధాన పంట కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపు పనులను చేపట్టారు. పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. జేఈ పి.సత్యనారాయణ, రైతులు ఉల్లూరి గోపాలరావు, మోకా సతీష్, గణపతి రావు, విష్ణుమూర్తి రాజు, సాకా వెంకటేశ్వర్లు, దీపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అతిగా వాడొద్దు

అంబాజీపేట: రైతులు అతిగా ఎరువులు వాడటం వల్ల పంట నష్టపోయే ప్రమాదం ఉందని సర్పంచ్ వాసంశెట్టి రేవతి అన్నారు. వక్కలంకలో ఆర్బీకే వద్ద రైతులకు ఎరువుల బస్తాలను మంగళవారం పంపిణీ చేశారు. సర్పంచ్ రేవతి మాట్లాడుతూ ఎరువుల కొరత లేకుండా అధికారులు ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్బీకేకు 225 ఎరువుల బస్తాలు వచ్చినట్లు ఆర్బీకే చైర్మన్ వాసంశెట్టి వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వాసంశెట్టి పెదబాబు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఆలమూరు: మండలంలోని మూలస్థాన అగ్రహారంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు జరిగింది. పుల్లాన్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు డాక్టర్ సాయి పవన్, కోఆర్డినేటర్ ఎస్.రాంబాబు వైద్య సేవలు అందించారు. వివిధ వ్యాధుల గుర్తింపునకు రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి



విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికర నాణ్యమైన భోజనం వడ్డించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఎంపీపీ, స్థానిక నాయకులు తదితరులు విద్యార్థులతో సహపంక్తి భోజనం చేసి కూరలపై ఆరా తీశారు. విద్యార్థులు తినే కూరలు శుభ్రతతో రుచికరంగా ఉండాలన్నారు. వంట చేసే ప్రాంతం, వంట పాత్రలు శుభ్రంగా ఉండాలన్నారు. గత ఐదు నెలల నుంచి బిల్లులు, జీతాలు రావడం లేదని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. త్వరలో బిల్లులు మంజూరయ్యేలా ఉన్నతాధికారులతో మాట్లాడతానని వారికి వివరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అల్లుడిపై దాడి చేశారంటూ ఫిర్యాదు

అయినవిల్లి: తన అల్లుడిపై ఓ కుటుంబం దాడి చేసి గాయపరిచిందని ఓ మామ ఇచ్చిన ఫిర్యాదు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నేదునూరు పెదపేటకు చెందిన తన అల్లుడు పులిదిండి శ్రీనివాసరావును మలకా అంజనీదేవి, రత్నకుమారి కుటుంబ సభ్యులు దాడి చేసి గాయపర్చినట్లు వరసకు మామ అయిన దడాల బాబ్జి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోక్సో చట్టం కింద కేసు

అయినవిల్లి: మైనర్ బాలికను వేధింపులకు గురిచేస్తున్న ఓ వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని అయినవిల్లి నేదునూరు పెదపేటకు చెందిన ఓ మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన పులిదిండి శ్రీనివాసరావు వేధింపులకు గురి చేస్తున్నాడన్నారు. దీనిపై అనేకసార్లు అతడిని మైనర్ బాలిక కుటుంబ సభ్యులు హెచ్చరించినా ప్రయోజనం లేదన్నారు. అదే విధంగా సోమవారం రాత్రి కూడా మైనర్ బాలికను శ్రీనివాసరావు వేధించాడన్నారు. దీనిపై మైనక బాలిక తల్లి ప్రశ్నిస్తే ఆమెపై దాడికి దిగారన్నారు. దీనిపై బాధితురాలి తల్లి ఫిర్యాదుతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

గ్రామీణ వాసులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు

ఆలమూరు: గ్రామీణ ప్రాంత వాసులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు చింతలూరులో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకును ఏర్పాటు చేసినట్లు మేనేజర్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా నున్న బ్యాంకు ప్రథమ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రీజినల్ మేనేజర్ వర్ల శ్రీనివాసు మాట్లాడుతూ ఏడాది కాలంలో బ్యాంకు ప్రగతిని వివరించారు.

ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థుల విద్యా, ఉపాధి అవకాశాలపై మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ ఎస్‌వీ ప్రసాదరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా సెట్రాజ్ మేనేజర్ సీఎస్‌వీ కాశీ విశ్వేశ్వరరావు, యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ వి.సూర్యనారాయణ పాల్గొన్నారు. విద్యార్థులకు సూచనలు, సలహాలు అందజేశారు. సెట్రాస్ అసిస్టెంట్ మేనేజర్ వి.శ్రీనివాస చౌదరి, ఫీల్డ్ ఆఫీసర్ కె.గౌతమ్ పాల్గొన్నారు.